


## చిన్నమాట

కథ అందరికీ నచ్చే సాహిత్య ప్రక్రియ. బాల్యం నించే మనిషికి కథలంటే ప్రీతి. అందుకే తెలుగులో వార, మాసపత్రికల్లో కథలు తప్పనిసరి. ఆఖరికి ఆదివారం అనుబంధాల్లో కూడా. కథా సరిత్సాగరం, కాశీ మజిలీ కథలు, పంచతంత్రం కథలు.... ప్రతి సంస్కృతికీ ఇలాంటి కథలున్నాయి. తెలుగు కథల నేపథ్యానికి విస్తృతి లేదు. ఈనాటికీ అవి ఎదగలేదు. ప్రేమ, కుటుంబం, జానపదం, హాస్యం, ఇంకా ఆఫీసు కథలు, కమ్యూనిస్ట్ కథలు, తెలుగు కథలు ఇలా కేవలం పరిమిత ఇతివృత్తాల చుట్టూనే తిరుగుతున్నాయి.

కమ్యూనిజం, స్త్రీవాదం, దళితవాదం కథలని అతి గొప్ప కథలుగా చలామణి చేసే ప్రయత్నం కొన్ని పదుల సంవత్సరాలుగా జరుగుతోంది. కథల పోటీల్లో అవార్డులుకూడా ఈ కథలకే వస్తూండడం కూడా మనం గమనించవచ్చు. ఈ మధ్య యువరచయితలనుంచీ స్వలింగ సంపర్కం లాంటి జుగుప్సాకరమైన కథలు కూడా వస్తున్నాయి.

తెలుగులో ఆ950-ఆ960లలో వెలువడ్డ కథలు ఈనాటికీ గుర్తుండిపోయే మంచి కథలు. ఆనాటి రచయితలు ఏ వాదానికీ కట్టుబడకుండా మానవ జీవితాల్లోని సున్నిత అంశాలతో కథలు రాసారు.

విదేశాల్లో, ముఖ్యంగా అమెరికా, యూరప్‌లలో కథా ఇతివృత్తం ఎంతో విస్తృతమైందని వారి పత్రికలు చదివాక నాకు అర్థమైంది. విపుల మాస పత్రిక ఆరంభించినప్పటినించి నేను వాటిని తెలుగులో అనువదిస్తున్నాను.

చిన్నప్పటినించి నాకు క్రైం కథలంటే ఇష్టం. ఆ రకం కథల ఇతివృత్తాలు కూడా ఎంతో విస్తృతమైనవి. హత్య, పరిశోధనే కాకుండా లాక్డ్ రూమ్ మిస్టరీస్, పజిల్స్, అతీంద్రియ కథలు, ట్విస్ట్ కథలు, హాస్యం, చరిత్ర, జానపద నేపథ్యం, కిడ్నాపింగ్, పగ, ప్రతీకారం, బ్లాక్ మెయిలింగ్ కథలు ఇంకా కిరాయి హంతకులు, వృద్ధులు, పిల్లలు, జంతువులు ప్రధాన పాత్రలుగాగల కథలు, రోడ్ కథలు, హృదయాన్ని స్పందింపచేసే కథలు... ఇలా వాటిలో ఎన్నో డివిజన్స్ ఉన్నాయి.

అలాంటి కథలని తెలుగు పాఠకులు ఈ నెలనించి కౌముదిలో నెలకి ఒకటి చదవగలరు. తెలుగు కథా వీధుల్లో లభ్యం కాని ఈ వినూత్న కథలు మిమ్మల్ని ఆనందింప చేస్తాయని ఆశిస్తూ ...

మీ మల్లాది వెంకట కృష్ణమూర్తి.

# కనబడుటలేదు
# { ఈవ్లిన్ గ్రాఫ్ డ్రూయల్ కథకి స్వేచ్ఛానువాదం}
# కథా కాలం: ఏప్రిల్ 1976

**ఏడమ్ గ్రే విమానం కిటికీలోంచి** బయటకి చూస్తూంటే ఎయిర్ హోస్టెస్ సీట్ బెల్ట్ కట్టుకోమని అతనికి చెప్పింది. అతనా పనిచేసి జేబులోంచి తన ఊరులోని స్థానిక దినపత్రిక నించి కట్ చేసిన వార్తని తీసి చదివాడు.

ఏడేళ్ళ అన్వేషణ తర్వాత ఓ మహిళ మరణించినట్లుగా ప్రకటన.

తన స్నేహితులు లిడ్డీగా పిలిచే మిసెస్ ఏడమ్ గ్రే కోసం గత ఏడేళ్ళుగా జరిగిన అన్వేషణ విఫలమవడంతో ఆమె మరణించినట్లుగా 'బ్యూరో ఆఫ్ మిస్సింగ్ పర్సన్స్,' ఇంకా 'ది ఐయల్ ఇన్సూరెన్స్' కంపెనీ ప్రకటించాయి. మిస్టర్ గ్రే తన భార్య ఆమె స్నేహితురాలు మిసెస్ ఏన్ ఇంట్లో ఉందని అనుకున్నాడు కాని లేదని ఆమె చెప్పాక, ఆమె గత మూడురోజులుగా కనపడటంలేదని ఏప్రిల్ 1969న షెరీఫ్ మైరన్‌కి ఫిర్యాదు చేసాడు.

షెరీఫ్ దాన్ని బ్యూరో ఆఫ్ మిస్సింగ్ పర్సన్స్ దృష్టికి తెచ్చాడు. బ్యూరో స్పోక్స్‌పర్సన్ మిసెస్ ఏడమ్ కి చెందిన ఒక్క ఆధారం కూడా తమకి లభించలేదని పేర్కొన్నారు. ఐదేళ్ళలోగా ఆమెని కనుక్కుంటారని ఏడం నమ్మాడు కాని గత రెండేళ్ళుగా ఆ ఆశని వదిలేసుకున్నానని చెప్పాడు. అతను తన ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి మరో ఊరుకి వెళ్ళిపోతున్నాడు.

ఏడమ్ కి ఏడేళ్ళ క్రితం తన భార్య వంటగదిలో ఆమె స్నేహితురాలు ఏన్‌తో మాట్లాడిన మాటలు గుర్తుకు వచ్చాయి. అతనో గుంటని తవ్వాడు. గోతిలోంచి మట్టిని పారపోయడానికి పైకి వచ్చినప్పుడు దాహం వేయడంతో, వంటికి అంటిన మట్టితో, చెమటతో అక్కడికి వచ్చాడు. ఏన్ మాటలు విని ఆగిపోయాడు.

"కాని లిడ్డీ నిజమే చెప్తున్నావా? ఏడమ్ ని వదిలి ఎలా వెళ్ళగలవు? అసలు ఎలా వెళ్తావు?" ఆ ప్రశ్నలో ఆశ్చర్యం ఉంది.

"నేను ఆయన్ని వదిలేయదలచుకున్నాను. అది ఆఖరి నిర్ణయం" భార్య మాటల్లో స్థిరత్వం ఉందని అర్థమైంది.

"కాని లిడ్డీ ఈ అందమైన ఇంటిని చూడు. నిన్ను ప్రేమించే భర్తని చూడు. ఫేక్టరీలో ఏడమ్ కి లాభాలని పంచుకునే పథకం కింద ఎంత డబ్బు వస్తుందో ఆలోచించు. ఇవన్నీ వదిలేసి వెళ్ళిపోవడం మూర్ఖత్వం."

"నేను ఇవన్నీ ఆలోచించానని నమ్ము. ఐనా వెళ్ళాలనే నిశ్చయించుకున్నాను."

"ఏడమ్ తన తీరిక సమయమంతా ఇంటిని అభివృద్ధి చేయడం కోసమే ఖర్చు చేయడం నిన్ను బాధిస్తోందని నాకు తెలుసు.

ఆ పనికి ఏడమ్ బానిస. కాని దాన్ని మర్చిపోయి మీ ఇద్దరి భవిష్యత్‌లోకి చూడు. అందమైన ఖరీదైన ఇల్లు, డబ్బు."

లిడ్డీ నవ్వు వినిపించింది.

"ఒకోసారి డబ్బు కన్నా విలువైంది ఉంటుంది ఏన్. నివశించడానికి హిల్‌క్రెస్ట్‌లో కన్నా ఇంకా మంచి ప్రదేశాలు ఉంటాయి.

"వేసవి శెలవల్లో బ్రౌన్స్ అరిజోనాలో, కార్టర్స్ న్యూయార్క్‌లో రెండు వారాలు గడిపారని కదా నీ బాధ. ఆ బాధ త్వరలో మాయమైపోతుంది. నువ్వు లేకుండా ఏడమ్ జీవించలేడని నీకు తెలుసు. నిన్ను అతను కనుక్కుని వెనక్కి తీసుకువస్తాడు."

"అతను నన్ను కనుక్కోలేడు. ఎవరూ కూడా" లిడ్డీ చెప్పింది.

"ఈ రోజుల్లో ప్రైవేట్ డిటెక్టివ్‌లు తేలిగ్గా మనుషుల్ని కనుక్కోగలరు లిడ్డీ."

"నీకు ఆలోచించడం చేతకాదు ఏన్."

"అంటే?"

"ఎవరైనా తనని వెదికే భర్తనించి మాయమవాలని అనుకుంటే ముందుగా ఆలోచించి తగిన పథకం వేసుకుని తీరుతారు. ఎవరూ కనుక్కోలేని దూరం."

"మనం పదకొండేళ్ళుగా మిత్రులం. నీ గురించి నాకు తెలుసు. నగరంలోని డిటెక్టివ్‌లకన్నా నువ్వు తెలివిగలదానివని నేను నమ్మను."

"నువ్వు ఎవరితోనూ నా పథకం గురించి చెప్పనంటే నీతో అది పంచుకుంటాను."

"లిడ్డీ! నేను నిన్ను నమ్మి నీకు నా రహస్యాలు చాలా చెప్పాను. నిన్ను నమ్మకపోతే ఒక్కమాట కూడా చెప్పేదాన్ని కాను. నువ్వు నాకు సోదరికన్నా ఎక్కువ."

"సరే. ఐతే విను."

చెమటతో తడిసిన ఏడమ్ కదలకుండా నిలబడి తన భార్య చెప్పేది విన్నాడు.

"ముందుగా నేనో పెద్ద నగరానికి వెళ్తున్నాను. అదేదో నీకు చెప్పను. ఎందుకంటే డిటెక్టివ్‌లు నిన్ను ప్రశ్నించినప్పుడు చెప్తావన్న భయంలేదుకాని, అది నువ్వు వాళ్ళకి చెప్పకపోవడం వల్ల నీలో అపరాధ భావం కలుగుతుందని నాకు తెలుసు. లేదా పోలీసులు ప్రశ్నించినప్పుడు. నేను డబ్బిచ్చి సెకండ్ హేండ్ కారు కొంటాను. దాని సేల్స్‌మేన్ ద్వారా కొత్త డ్రైవింగ్ లైసెన్స్‌ని నాకొత్త పేరుతో తీసుకుంటాను. దాంతో నా కొత్త ఐడెంటిటీ సృష్టించబడుతుంది. ఆ పేరు డిటెక్టివ్‌లకి తెలీదు కాబట్టి వాళ్ళు వెదికేది లిడియా గ్రే కోసమే. దాంతో వాళ్ళు నన్ను పట్టుకునే అవకాశాలు చాలా తగ్గిపోతాయి."

"వేలిముద్రల మాటేమిటి?"

"ఇంతదాకా ఎవరూ నా వేలిముద్రలని తీసుకోలేదు. పాస్‌పోర్ట్‌కి అప్లై చేయాల్సిన అవసరం కూడా రాలేదు. పోలీస్ స్టేషన్‌కి సాక్షిగా కూడా వెళ్లలేదు. తర్వాత నా జుట్టు రంగు మార్చుకుంటాను. కాంటాక్ట్ లెన్స్ కొనుక్కుని ఈ కళ్ళద్దాలని తీసేస్తాను. కనీసం పద్దెనిమిదినించి ఇరవై కిలోల బరువు తగ్గుతాను. అది నన్ను ఎవరూ గుర్తించకపోవడానికి సహాయం చేస్తుంది. వాళ్ళు వెదికేది భారీకాయంగల మనిషిని."

"వింటూంటే నీ పథకం బానే ఉన్నట్లుంది లిడ్డీ."

"అంతేకాదు. నా ఎత్తు పళ్ళని బ్రేసెస్ ద్వారా సరిచేయించుకుంటాను. నేను లావుగా ఉండే ఇల్లాలిని కాను. సన్నగా, నాజూగ్గా, ఆకర్షణీయంగా ఉండే కొత్త పేరు గల స్త్రీని."

"ఆదాయం? ఎలా జీవిస్తావు?"

"నాలుగేళ్ళుగా నేను కరస్పాండెన్స్ కోర్స్ ద్వారా నేర్చుకుని సంపాదించిన డిప్లమా నాకు లైబ్రరీలో ఉద్యోగాన్ని ఇస్తుంది."

"నువ్వే డిప్లమా చదివావో ఏడం డిటెక్టివ్‌లకి చెప్తాడేమో? అప్పుడు నువ్వు ఏ రకం ఉద్యోగం చేస్తావో దాని ద్వారా వాళ్ళు  నిన్ను కనిపెట్టచ్చు."

"నా మనసులో ఈ ఆలోచన వచ్చాకే ఆ కోర్స్‌లో చేరాను. పాఠాలు మా ఇంటికి రాకుండా మారుపేరుతో అద్దెకి తీసుకున్న పోస్ట్ బాక్స్‌కి వచ్చేవి. ఏడంకి నేనీ కోర్స్ చేసిన సంగతే తెలీదు. నన్ను ఎవరూ ఎప్పటికీ కనుక్కోలేరు."

"నిజమే అనిపిస్తోంది లిడియా."

తర్వాతి మంగళవారం ఏడమ్ గోతిని పూర్తిగా తవ్వాక బేస్‌మెంట్ సెస్ పూల్‌కి మురికి గొట్టాలని అమర్చి పూల్‌కి కవర్లని అమర్చాడు. అదేరోజు ఆమె మాయమైంది.

మూడు రోజుల తర్వాత అతను ఏన్‌కి ఫోన్ చేసాడు. లిడియా ఆమె ఇంట్లో లేదు. మరికొందరు బంధుమిత్రులకి ఫోన్ చేసాక షెరీఫ్ మైరన్‌కి ఫిర్యాదు చేసాడు. మైరన్ రెండు రోజులపాటు ఏడమ్ ని, ఏన్‌ని ప్రశ్నించాడు. ఏన్ లిడ్డీ చెప్పిన పథకంలోని ఒక్కమాట కూడా షెరీఫ్‌కి చెప్పకపోవడం ఏడమ్ కి ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆమె నిజమైన స్నేహితురాలు. ఏడమ్ లిడియా పేరుతో నాలుగేళ్ళ క్రితం భారీ మొత్తంలో ఇన్సూరెన్స్ తీసుకున్నాడు.

"మన విమానం ఐదు నిమిషాల్లో బ్యూనస్ ఎయిర్స్‌లో దిగబోతోంది" ఎయిర్ హోస్టెస్ ప్రకటన విన్నాక ఏడం గతంలోంచి ప్రస్తుతంలోకి వచ్చాడు.

అతని పాస్ బుక్‌లో నాలుగు కొత్త ఎంట్రీలు ఉన్నాయి. లిడియా ఇన్సూరెన్స్ పాలసీ నించి ఐదు లక్షల డాలర్లు, ఇంటిని అమ్మగా వచ్చిన మూడు లక్షల పదివేల డాలర్లు, షేర్ ది ప్రాఫిట్స్ పథకం కింద లక్షా అరవై వేల డాలర్ల్, షేర్స్ అమ్మకం ద్వారా లక్షా ముప్పైవేల డాలర్లు.

విమానం దిగాక ఎగ్జిట్ గేట్ దగ్గరకి వెళ్ళేదాకా అతనికి కాలం ఎంతో భారంగా గడిచింది. గుండె వేగంగా కొట్టుకుంటూంటే అతను గేట్‌లోంచి బయటకి వచ్చి చుట్టూ చూసాడు. చివరికి బంగారు రంగు జుట్టుగల ఓ పొడుగాటి, సన్నటి ఆకర్షణీయమైన ఒకామె నల్ల కళ్ళజోడుని తీసి చేతిని ఊపింది. ఏడమ్ గబగబా ఆమె దగ్గరకి వెళ్ళి తన చేతుల్లోకి తీసుకుని ఉద్వేగంగా చెప్పాడు.

"లిడియా డార్లింగ్, ఏడేళ్ళు నీకు దూరంగా ఎలా ఉండగలిగానా అని అనిపిస్తోంది."

**(వచ్చేనెల మరో కథ)**

Post your comments